క్లుప్తంగా

పొలాల్లో మందు బాటిళ్లు

దుమ్ముగూడెం: రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఎండకాలంలో మందుబాబులు తాగిపడేసిన మద్యం బాటిళ్లు పగిలి రైతులు, రైతు కూలీలు గాయాలపాలవుతున్నారు. రైతాంగం పొలం పనుల్లో నిమగ్నమై దుక్కులు దున్ని పంటలు వేసేందుకు సమాయత్తం కాగా చాలా చోట్ల రైతులు పంట పొలాల్లో అడుగిడిన మరుక్షణమే రక్తపు గాయాలతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం మండలంలోని నర్సాపురం గ్రామంలో ఓ రైతు పొలంలో పనులు చేస్తుండగా మందుబాబులు తాగిపడేసిన బీరు బాటిల్ పగిలి గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే వైద్యశాలకు తరలించి చికిత్స అందజేయగా బాధితుడి గాయానికి మూడు కుట్లు పడ్డాయి. మందుబాబులు తమ సిట్టింగ్ అడ్డాలను మార్చుకోవాలని రైతులు కోరుతున్నారు.

డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆధ్వర్యాన నిర్వహించనున్న వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత, పునరావాస గ్రామాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 50 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కాగా, 18 నుంచి 35 ఏళ్ల వయసున్న అభ్యర్థులు దరఖాస్తు పత్రంతో పాటు పదో తరగతి మెమో, కుల, ఆదాయ, హెవీ గూడ్స్ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డ్, పీడీఎఫ్, పీఏపీ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు, రెండు పాస్ ఫొటోలను జతచేసి పైలట్‌కాలనీ ఎంవీటీసీ కార్యాలయంలో ఈనెల 10 లోపు అందజేయాలన్నారు. అంతేకాక ఫిజికల్ ఫిట్‌నెస్ ఉండాలని, ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్క్రీనింగ్ టెస్టుల పరిశీలన

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కాంట్రాక్ట్ కార్మికులకు ఏరియా వైద్యశాలలో జరుగుతున్న స్క్రీనింగ్ టెస్టులను శనివారం ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్, డీజీఎం రమేశ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో రోజు క్యాంప్‌లో 263 మంది కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డీవైసీఎంఓ మేరీకుమారి, వైద్యులు శేషగిరిరావు, సురేశ్, రవికుమార్, రమణ, ప్రవీణ్, మ్యాట్రిన్ సారా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిద్దార్థ ఒకేషనల్, మహాత్మా గాంధీ జ్యోతి రావ్ పూలే కళాశాలలోని బాలికలకు మిషన్ శక్తిపై మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సంతోష రూప, జహేదలు 100 రోజుల్లో భాగంగా విద్యార్థులకు అత్యవసర సమయాల్లో ఏలా స్ఫూర్తితో వ్యవహరించాలనే దానిని తెలియజేశారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా పెరియర్ మాట్లాడారు. నాయకులు కొప్పుల తిరుపతి, మేకల లత, కమ్మగిరి వెంకటేశ్వర్లు, కోట ప్రభాకర్, మేడ్చల్ లక్ష్మణ్, కొచ్చర్ల కుమారి, నాగమణి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దుమ్ముగూడెం: గోదావరి వరదల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్ ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని గోదావరి వరద ప్రభావిత సున్నం బట్టి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సున్నం బట్టి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. గోదావరి నీటిమట్టం పెరిగి గ్రామం ముంపునకు గురై అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటే ప్రభుత్వ సహకారంతో ప్రమాదాలను నివారించవచ్చని గ్రామస్తులతో చర్చించారు. ఎస్సై కేశవరావు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులను నియంత్రించాలి

చండ్రుగొండ: వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీపీ బాణోత్ పార్వతి కోరారు. ఎంపీపీ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ పార్వతి మాట్లాడుతూ.. డ్రైడే డ్రైడే కార్యక్రమంలో కొన్ని పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది చురుగ్గా పాల్గొనడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. విద్యా, విద్యుత్, పౌరసరఫరాల శాఖలపై ప్రధానంగా సమీక్ష సాగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ బి.అశోక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీలు దారవెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, సంగొండి కుమారి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

పాములు పడుతూ.. ప్రాణాలు కాపాడుతూ..

- మూడు తరాలుగా ప్రజలకు సహకారం..
- అభినందిస్తున్న స్థానికులు

బూర్గంపాడు: పాములను చూస్తే ఎవరికైనా గుండె లదిరి పోవాల్సిందే. కొందరు భయంతో వణికిపోతారు.. మరికొందరు అక్కడి నుంచి పారిపోతారు. పొలం పనులకు వెళ్లిన కూలీలు, రైతులకు ఎక్కువగా పాముల భయముంటుంది. కానీ బూర్గంపాడులోని ఓ కుటుంబం మాత్రం వాటని పట్టుకుని అటవికి తరలిస్తోంది.

వర్షాకాలంలో వరదలకు ఇళ్లలోకి, ప్రభుత్వ కార్యాలయాల్లోకి కూడా పాములు చేరుతుంటాయి. కొన్ని సందర్భాలలో వాటిని గమనించక పాముకాటుకు గురైన వారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో బూర్గంపాడు మండల వాసులకు పాములు కనిపిస్తే వెంటనే స్థానిక పాముల సాహెబ్‌లకు సమాచారం అందిస్తుంటారు. ఇళ్లలోకి పాములు చేరిన, ప్రభుత్వ కార్యాలయాలల్లో, పాఠశాలల్లో పాములు కనిపించిన వెంటనే పాముల సాహెబ్స్‌కు సమాచారమిస్తే చాలు.. క్షణాలలో వారు అక్కడికి చేరుకుని పాములను పట్టుకుంటారు. పట్టుకున్న పాములను డబ్బాలలో బంధించి అటవీప్రాంతంలో వదులుతారు. గత ఎనిమిది దశాబ్దాలుగా పాముల సాహెబ్స్ వారి వారసులు ఇలానే పాములు పట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. పాముకాటుకు గురైన వారికి కూడా వీరి కుటుంబం చికిత్సలు అందిస్తుంది. ఇలా వీరి కుటుంబం నాలుగు తరాలుగా అటు ప్రజలను, ఇటు పాములను కూడా కాపాడుతున్నారు.

చారిత్రక నేపథ్యం..

బూర్గంపాడుకు చెందిన మహ్మద్ హుస్సేన్ అలీ నిజాం నవాబుల కాలం నుంచి పాములు పట్టి ప్రజలను కాపాడుతున్నారు.ఆయన బూర్గంపాడులో పెద్దరైతు. వ్యవసాయం వృత్తిగా పాములు పట్టడం ప్రవృత్తిగా ఆయన మార్చుకున్నారు. పాముకాటుకు గురైతే ఆయనే వైద్యసేవలను అందించి నయం చేసేవాడు. ఆయనతో పాటుగా వారి కుటుంబసభ్యులకు కూడా ఇదీ వారసత్వంగా



పామును పడుతున్న షౌకత్ అలీ

మార్చుకున్నారు. ఆయన కుమారులు మహబూబ్ అలీ, సులేమాన్‌లు కూడా పాములు పట్టడం నేర్చుకున్నారు. తండ్రి వారసత్వంగా పాము కాటుకు చికిత్సలు కూడా చేసేవారు. పూర్వం ఆస్పత్రులలో పాము కాటుకు సరైన వైద్యం అందని రోజులు బూర్గంపాడు తాలూకాలో వీరి వైద్యానికి మంచి గుర్తింపు ఉండేది. వీరి తరువాత సులేమాన్ కుమారుడు హుస్సేన్ అలీ, మహబూబ్ అలీ కుమారుడు అబ్దుల్ ఘని పాములు పట్టే బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం వయసు రీత్యా హుస్సేన్ అలీ వృద్ధుడు కావటంతో ఆయన కుమారుడు షౌకత్ అలీ పాములు పట్టే బాధ్యత తీసుకున్నాడు. ప్రస్తుతం బూర్గంపాడు మండలంలో పాములు కనిపించిన సమాచారం వస్తే అబ్దుల్ ఘని, షౌకత్ అలీలలో ఎవరో ఒకరు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పామును పట్టి వాటిని అటవీప్రాంతంలో వదిలేసి వస్తుంటారు. ఇందతా కూడా వారు ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా ప్రజల భయాందోళనలు పోగొట్టేందుకు చేస్తుంటారు. పాములను ఎవరు చంపవద్దని, పాము కనిపిస్తే తమకు సమాచారమివ్వాలని వారు కోరుతుంటారు. జీవ వైవిధ్యంలో భాగంగా భూమిపై పాములు కూడా జీవించాలని వారు సూచిస్తుంటారు. పాములకు ఏదైనా నొప్పి కలిగిస్తేనే అవి కాటు వేస్తాయని, లేకుంటే వాటి దారిన అవి వెళ్లిపోతాయని పాముల సాహెబ్స్ చెబుతుంటారు.



పామును పడుతున్న అబ్దుల్ ఘని

లాభాపేక్షలేని సహకారం..

బూర్గంపాడు మండలంలో ఎక్కువగా గోదావరి వరదలు వస్తుంటాయి. వరదల సమయంలో మండలంలోని పలుగ్రామాలలో ఇళ్లు నీటమునుగుతాయి. ఈ సమయంలో పాములు ఇళ్లలోకి వచ్చి చేరుతుంటాయి. అర్థరాత్రి, అపరాత్రులలో కూడా పాము కనిపించిన సమాచారిమిస్తే పాముల సాహెబ్స్ ఎన్ని ఇబ్బందులున్న ఆ ప్రాంతానికి వచ్చి పాములను పట్టుకుంటారు. ఇళ్లలోని చేరిన పాములను పట్టుకోవటం చాలా కష్టం. అవి ఇళ్ల పైకప్పుల లోకి, కన్నాలలోకి, ట్రంకు పెట్టెలలోకి, ఇతర సామాగ్రిలోకి చేరుతుంటాయి.వాటిని గుర్తించి చాకచక్యంగా పట్టుకోవటానికి చాలా సమయం తీసుకుంటుంది. ఒకోసారి నాలుగైదు గంటల సమయం కూడా పడుతుంది. ఎంత ఇబ్బందికలిగిన వారు మాత్రం పామును పట్టుకోకుండా వెళ్లిన ఘటనలు లేవనే చెప్పాలి. ఎలాంటి డబ్బులు ఆశించకుండా సామాజిక బాధ్యతగా పాములను పట్టుకుని ప్రజల ప్రాణాలను, అదేసమయంలో పాముల ప్రాణాలను కూడా వారు కాపాడుతున్నారు. వృత్తిరీత్యా వేర్వేరు వ్యాపకాలలో ఉన్నప్పటికి పాములు పట్టి ప్రజల ప్రాణాలను కాపాడటం మాత్రం వారు ప్రవృత్తిగా భావిస్తున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

బూర్గంపాడు: మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కృష్ణసాగర్ గురుకుల కళాశాల ఆవరణలో శనివారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. మొక్కల ఆవిష్యతను వివరించారు. వేపలగడ్డ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, డ్రెయినేజీ శుభ్రతపై సూచనలిచ్చారు. అయా కార్యక్రమాలలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.22 లక్షలతో రోడ్డు ప్రారంభం

మణుగూరుటౌన్: ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు, అదనంగా హాస్టల్ వరకు రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. తొలుత వన మహోత్సవం సందర్భంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ యూసఫ్ పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తేగా.. వెంటనే నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులను అడిగి కళాశాలలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సమాధానం రాబట్టారు. పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాల్సిందిగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, సిబ్బంది లక్ష్మణ్‌రావులు కోరగా.. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆపై 100 పడకల ఆస్పత్రి వద్ద స్పీడ్ బ్రేకర్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, శివ



బూర్గంపాడు: కృష్ణసాగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పాయం

సైదులు, వైస్ ఎంపీపీ కేవిరావు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, నాయకులు గాండ్ల సురేశ్, కూచిపూడి బాబు, గణేశ్‌రెడ్డి, వరలక్ష్మి, కూరపాటి సౌజన్య, గోరంట్ల కనకయ్య, మానస, తహసీల్దార్ రాఘవరెడ్డి, పంచాయతీ రాజ్ అధికారి సైదులు, రామారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అయోధ్యకు పరామర్శ..

పట్టణానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యచారి శుక్రవారం గుండెపోటుకు గురై భద్రాచలం కిమ్స్ ఆస్పత్రిలో వైద్యచికిత్సలు పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శనివారం ఆస్పత్రికి వెళ్లి అయోధ్యను పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఆవుల నర్సింహారావు, నూకారపు రమేష్, రాజులు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయోధ్యను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అనుమానాస్పద ఇళ్లలో తనిఖీలు



ములకనాపల్లి గ్రామస్తులతో పోలీసులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకనాపల్లి వలస గొత్తికోయ గ్రామంలో దుమ్ముగూడెం, జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు శనివారం కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానిత వ్యక్తుల కోసం ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం గ్రామంలో నివసిస్తున్న మొత్తం 21 కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం, ఉనికి కోసం ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి నిరోధకులుగా మారిన మావోయిస్టు పార్టీకి సహకరించవద్దని గ్రామస్తులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ అశోక్, ఎస్సై పి.గణేష్, ఆర్ఎస్ఐ హుస్సేన్, స్పెషల్ పార్టీ సిబ్బంది, ములకనాపల్లి గ్రామ పెద్దలు మడకం రామయ్య, మడకం మాడయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

దమ్మపేట: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేటలో మండల బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, గొట్టిపుళ్ల దుర్గా శ్రీనివాస్, కోలికపోగు మునలయ్య, ప్రశాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, నాయకులు మేడవరపు చైతన్య, బుడిపుటి శ్రీను, యశోద కల్యాణ్, శ్యామ్ కుమార్, వినోద్, అక్షయ్ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

ములకలపల్లి: మండల పరిధిలోని మొగరాలగుప్ప గ్రామస్తులకు గిరిజన ఉపప్రణాళికంలో భాగంగా సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ (ఎస్ఎస్‌జీఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా జామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ అటవీ శాస్త్ర విభాగ ప్రధాన శాస్త్రవేత్త ఏవీ.రామాంజనేయులు సహకారంతో అగ్రి మోడల్ ప్లాంటేషన్ నిమిత్తం వీటిని రైతులకు అందజేశారు. సంస్థ సిబ్బంది మాట్లాడుతూ .. జంటసాళ్ల పద్ధతిలో జామాయిల్ మొక్కలు నాటి, మొక్కజొన్న, మినుము, పెసర, బొబ్బెర, వేరుశనగ తదితర పంటలను అంతరసాగుగా సేద్యం చేయవచ్చని తెలిపారు. తద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ఎస్ఎస్‌జీఎస్ సంస్థ సిబ్బంది సుంకర రంగారావు, ఏపీఓ సమ్మయ్య, సీఓ ముత్యాలరావు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లోని అంతర్గత రహదార్లు అధ్వానంగా తయారయ్యి గుంతల్లో వర్షపునీరు నిలుస్తోందని, తక్షణమే రహదార్లకు మరమ్మతులు చేయించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ చర్ల మండల కార్యదర్శి కొడా కౌశిక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దండుపేట, భూముల్లంక, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రవీంద్ర, రామకృష్ణ, దుర్గాప్రసాద్, రామారావు, కోటేష్, మురళి, లక్ష్మి, సారమ్మ, కుమారి, మాణిక్యం, రామతులసి పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

దమ్మపేట: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేట సొసైటీ కార్యాలయంలో చైర్మన్ ఎల్లిన రాఘవరావు చేతులమీదుగా సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, డైరెక్టర్లు చిన్నశెట్టి సత్యనారాయణ, బొల్లికొండ నాగేశ్వరరావు, కేశవరావు, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, యర్రగొర్ల రాధకృష్ణ, సొసైటీ సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

దమ్మపేట: మండల పరిధిలోని నాచారంలోని ఓ కిరాణా షాపులో నిషేధిత గుట్కా ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేర కు శనివారం ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. దీంతో ఆ షాపులో రూ.రెండు వేల విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుబడగా.. వాటిని స్వాధీనం చేసుకుని షాపు నిర్వాకుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



రాజ్ కుమార్

పినపాక: ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ ఎస్సైగా రాజ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ కొత్తగూడెం నుంచి బయ్యారం పోలీస్ స్టేషన్‌కి బదిలీపై వచ్చిన ఆయన.. గ్రామాల్లో పర్యటించి నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని, అసాంఘిక శక్తులను అరికడతామని తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓగా..

బూర్గంపాడు: బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై రాజేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై సుమన్ బదిలీపై సీసీఎస్‌కు వెళ్లటంతో కొత్తగూడెం టూటౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక కమిటీ

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు శనివారం డ్రగ్స్ వ్యతిరేక కమిటీ ఏర్పాటు చేశారు. పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ కమిటీ ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, కమిటీ అధ్యక్షుడిగా ఎంఏ వాజిద్, సభ్యులుగా గుర్రం సురేష్, ఎస్‌కె.జాఫర్, సీహెచ్ మధుసుదన్‌రావు, కె.సతీష్, మేఘన, పి.సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ, కానిస్టేబుల్ శివలను ఎన్నుకున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ.. అనేక ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని, శివలింగాపురంకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌వి.నాయుడు, ఎస్‌కె.సర్వర్, కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం చుట్టూ నిర్మించిన షెడ్లను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈఓ రమాదేవి అన్నారు. ఆలయం చుట్టూ జీఎమ్‌ఆర్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటితో నిర్మించిన షెడ్లను ఆమె శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి ముమ్మరంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, ఇంజనీర్స్ గంగాధర్, శ్రీనివాస్, రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

ములకలపల్లి: ములకలపల్లి ఎస్సైగా విధులు నిర్వహించి, గుండాల మండలానికి బదిలీపై వెళ్తున్న రాజమౌళిని పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈసందర్భంగా ఎస్సై రాజమౌళి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి



ఆస్పత్రి భవనంపై నీళ్లు నిలిచిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గుమ్మడి గాంధీ

పినపాక: మండలంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి పనులు పూర్తిచేసి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీపీ గుమ్మడి గాంధీ అన్నారు. శనివారం ఎంపీడీఓ రామకృష్ణ, వైద్యాధికారిణి దుర్గ భవానితో కలిసి ఆయన నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. భవనంపై వర్షపు నీరు నిలువకుండా చేసి, మైనర్ పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణంలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపంటి సత్యం, హెచ్‌ఎస్ఓ వీరాస్వామి, ఏపీఓ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'వెంకటచెరువు'లో వైద్య శిబిరం

చర్లరూరల్: మండలంలోని వెంకటచెరువు గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామంలోని సుమారు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరికి సాధారణ జ్వరాలుగా తేలగా.. మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ,హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, స్టాఫ్ నర్స్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ సమ్మక్క, అనసూర్య, నరసింగరావు పాల్గొన్నారు.

విద్యార్థికి సీఐ ఆర్థిక సాయం

చర్ల: మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామానికి చెందిన ఓ విద్యార్థి చర్ల సీఐ ఏ.రాజువర్మ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కురకట్‌పాడు గ్రామానికి చెందిన రవ్వా జోగ్నేష్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రిపరేషన్‌కు ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదును సీఐ రాజువర్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం అందజేశారు. సీఐ వెంట ఎస్సై నర్సిరెడ్డి ఉన్నారు.

సహచరుడికి ఆటో యూనియన్ సభ్యులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ అవుట్ గేట్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సభ్యుడికి ఆర్థిక సహాయం చేశారు. యూనియన్ సభ్యుడు సీతయ్య తల్లి అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించిన యూనియన్ సభ్యులు వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ అజీమ్, రమేష్, లక్ష్మణ్, చంటి, బలరాం, సైదులు, నాగేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం ఓ భక్తురాలు విరాళం అందజేశారు. ఖమ్మం పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన సోమేశ్వరరావు–కమల దంపతులు రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోగా.. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.స్వామి వారి కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రిలే దీక్షలు ప్రారంభం

మణుగూరుటౌన్: సింగరేణి బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 6 నుంచి 12 వరకు ఏఐటీయూసీ తలపెట్టిన రిలే దీక్షలకు సోమవారం మణుగూరులో ప్రారంభమయ్యాయి. స్థానిక జీఎం కార్యాలయం ఎదుట దీక్షను సంఘం బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ కార్మికులకు కండువా కప్పి, పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేసి, ఎటువంటి ఆంక్షలు లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాసరావు, అబ్దుల్ సుభానీ, ఆడెపు రాజశేఖర్, ఫిట్ సెక్రటరీలు ఆంతోని రవికుమార్,



మణుగూరుటౌన్: దీక్షలో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్.శివ, ఎండి.ఇమాముద్దీన్, దండు విజయ్, జల్లారపు రమేశ్, శ్రీనివాస్, నాగుల సతీష్, ఏడుకొండలు, రామకృష్ణ, కార్మికులు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన

చండ్రుగొండ: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యయత్నానికి కారకులపై చట్టపర చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తలారి నాగరాజు, వై.లక్ష్మణరావు, ఇల్లంగి బాలకృష్ణ, లాజర్, గుర్రం సురేష్, తంబళ్ల మంగయ్య, నాగబాబు, పి.నరేందర్, దాసరి వెంకటేష్, తాలారి నరేందర్, రాయి శ్రీను, బడుగు చరణ్ పాల్గొన్నారు.

పగిడేరులో దోమలమందు పిచికారీ



పినపాక: దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గాంధీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామంలోని ఇళ్లల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం దోమల మందు పిచికారీ చేశారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాల్లో, పాత కంటైనర్లలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మారేడుగుంపులో..

పినపాక: పినపాక గ్రామపంచాయతీలోని మారేడు గుంపు గ్రామంలో దోమల మందు పిచికారీని ఎంపీపీ ప్రారంభించారు. వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీలో రోడ్లమీద నీరు, మురుగు లేకుండా చూడాలని, బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడిలైఫ్ హాస్పిటల్
RTC బస్టాండ్ ఎదుట, భద్రాచలం.
Cell: 7036206111.
ప్రతి నెల మొదటి ఆదివారం 07-07-2024 నాడు ఉచిత వైద్య శిబిరాలు
డా॥ యన్.రాహుల్ MD, DM న్యూరో ఫిజిషియన్ (మైగ్రేన్ తల నొప్పి, మూర్ఛ (ఫిట్స్), పక్షవాతం)
డా॥ పి. రాహుల్, MD, DM నెఫ్రాలజిస్ట్ (డయాలసిస్, కిడ్నీ సంబంధితవి)
డా॥ బాబురావు ఎరుకు, MD (Pulmonology) ఆయాసం, క్షయ & ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు
డా॥ వి. కృష్ణంరాజు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్
మంగళ, శనివారంలో అపాయింట్‌మెంట్ కొరకు-7036206333

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183